తనవలనే వేశ్యగా మారిన ఆమెను అతను భార్యగా స్వీకరించాడా?

కందుకూరి వెంకటమహాలక్ష్మి కథ

# ఒకటే గమ్యం

గాగుల్స్ తీసి మళ్ళీ చూసాడు. గాగుల్సులోంచి మబ్బుల్లో చంద్రుడిలా కనపడ్డ ముఖం యిప్పుడు మబ్బు విడిన చంద్రుడిలా వుందంతే! "నువ్వు చూసింది నిజమే!" అని మనసు నొక్కి మరీ చెప్పింది. ఆ వెంటనే కాస్త దగ్గరగా వెళ్ళి "దీపా!" అని నెమ్మదిగా పిల్చాడు భరణి. ఒక్కసారిగా పక్కకి తిరిగి చూసిన ఆమె ఉలిక్కిపడి, తరువాత ముఖం చిట్లించి గబగబా రోడ్డుకడ్డంగా నడిచి అటు ప్రక్క ఆగిన ఆటో ఎక్కి వెళ్ళిపోయింది.

భరణి మనసు బాధగా మూలిగింది. మరో ఆటో ఎక్కి హోటల్ రూంకి పోనీమన్నాడు.

గదిలోకొచ్చిన భరణి బ్రీఫ్‌కేస్ టేబిల్‌పై పడేసి అలాగే మంచంమీద వాలిపోయాడు. మనసంతా నిండిపోయిన దీప జ్ఞాపకాలు ఎంత పారద్రోలాలన్నా సాధ్యం కావటంలేదు.

"దీపకి యింకా నామీద కోపం పోలేదన్నమాట" అనుకున్నాడు.

భరణి మనసు అతన్ని గిర్రున రెండేళ్ళు వెనక్కి లాక్కెళ్ళింది.

అవి కాలేజీ రోజులు బాధ్యత లెరగని విద్యార్థి దశ. హుషారుగా నవ్వుతూ, నవ్విస్తూ కాలం గడుపుతున్న రోజుల్లో అతనిలోని ఉడుకు రక్తానికి పరీక్ష పెట్టింది దీప. చెల్లెలు రోజా, దీపా క్లాసుమేట్సు కావడంవల్ల దీప తరచూ ఇంటికి రావడం జరిగేది. అప్పుడప్పుడు తనూ వారితో కలిసి సరదాగా కబుర్లాడేవాడు. ఆ స్నేహం అలా



పెరిగి ప్రేమగా మారింది. దీపని పెళ్ళి చేసుకోవాలని భరణి నిశ్చయించుకున్నట్లు తెలిసి రోజా అన్నని పిల్చి, "అన్నయ్య నువ్వు దీపని పెళ్ళి చేసుకుంటావన్నావని తెలిసింది. ఈ అనురాగం, ప్రేమ ఒక బంధంగా ముడిపడక ముందే నువ్వు దీప గురించి తెలుసుకోవడం చాలా అవసరం" అంది.

"ఏమి"టన్నట్లు కళ్ళు పెద్దవి చేసి

ప్రశ్నించాడు భరణి.

"అన్నయ్యా! దీప తల్లి ఒక జమిందారుకి ఉంపుడుగత్తె, ఆమె దీపని చదివించి, ఉద్యోగస్తురాలిని చెయ్యాలని, తనలా కాకుండా, సంసారిగా జీవిస్తూ హాయిగా బ్రతకాలని ఎన్నో ఆశల్ని పెంచుకుంది. కానీ వయసొచ్చినా దీప సౌందర్యం మీద ఆ జమిందారు కళ్ళు పడి ఆమె పొందుని కోరగానే దీపతల్లి తిరస్కరించింది. దాంతో జమిందారు వాళ్ళని వెళ్ళగొట్టాడు. అప్పటిదాకా ఆ జమిందారు నీడన వారి రోజులు సాఫీగా గడుస్తున్నని ఒక్కసారిగా బజారుపాలయ్యాయి. అక్కడ వుండడం యిష్టంలేని దీప తల్లి, ఆమెని తీసుకొని ఈ ఊరికొచ్చేసింది. తనకున్న నగా, నట్రా అమ్మి దీపకి కనీసం డిగ్రీ అన్నా చెప్పించాలని తాపత్రయపడుతోందా తల్లి.

ఈ విషయం ఎలాగో కాలేజీ అంతా తెలిసి దీపని భోగందాని కూతురని హేళన చేస్తుంటారు. ఆఖరికి కొందరు లెక్చరర్లు కూడా ఆమెవద్ద చవకబారు జోకు లెయ్యడమేకాక "చదువయ్యాకా మీ వృత్తి చేపడతావా?" అని యికిలిస్తూ అడుగుతూ వుంటారుట. దీప కాలేజీలో ఎవ్వరితో మాట్లాడదు. నేను తప్ప తనకి స్నేహితులు కూడా లేరు. ఒక్కోరోజు నాతో దీప యివన్నీ చెప్పుకుని బాధపడుతూ వుంటుంది. ఈ విషయాలన్నీ నీతో చెప్పమన్నది కూడా దీపే! అందుకు ముందే అన్నీ ఆలోచించుకుని దీపని పెళ్ళి చేసుకోడం మంచిదని నా అభిప్రాయం" అంటూ దీప చెప్పిన మాటల్ని విన్న భరణి ఆలోచనలో పడ్డాడు.

మర్నాడు రోజాని పిల్చి "చెల్లాయి! అందులో దీప నేరమేముంది? కాబట్టి నేను ఆరు నూరైనా, నూరు ఆరైనా నా చదువు పూర్తయ్యాక దీపనే భార్యగా స్వీకరిస్తా"నని చెప్పాడు.

అన్నగారి నిర్ణయం విన్న రోజా ముఖం ఆనందంతో వికసించింది. "అన్నయ్యా! దీప చాలా మంచిపిల్ల. ఆమెకో మంచి జీవితానిచ్చి, ఆమె భవిష్యత్‌ని చక్కదిద్దు, నువ్వామెని బంగారు బాటలో పయనింపజెయ్యి. అమ్మా, నాన్నగార్లకి కూడా ఈ విషయం చెప్పడం మంచిది. నేనే సమయం చూసి చెప్తాను" అంటూ అక్కడినుంచి నిష్క్రమించింది.

మామిడి చెట్టుని అల్లుకున్న మాధవీ లతలా ఆ ప్రేమికుల మనసులు అనురాగంతో పెనవేసుకుని పూత ఆరంభిస్తున్న తరుణంలో ఓరోజు బజార్లో కనపడిన దీప "భరణీ నీతో కొంచెం మాట్లాడాలి అలా పార్కులోకి వస్తావా?" అని అడిగింది.

ఇద్దరూ పార్కులో జన సంచారంలేని ఓ మూల కూర్చున్నారు. దీప చాలా దిగులుగా కనపడింది.

"భరణీ! నిన్ను ఎలా కలవడమా? అని అనుకుంటుండగా అదృష్టవశాత్తూ బజార్లో కనపడ్డావు. నీకో ముఖ్యమైన విషయం చెప్పాలి. నా జీవితంలో జరుగ కూడని చెడు జరిగింది. ఓ దుర్మార్గుడు నా జీవితాన్ని సర్వనాశనం చేసాడు. నేను అపవిత్రురాలి

నయ్యాను. ఈ బాధ ఎవ్వరితో చెప్పుకోలేక నాలోనేను కుళ్ళిపోతున్నాను. చెప్పినా "అసలు నువ్వు పతివ్రతవా!" అని ప్రశ్నించి హేళన చేస్తారే తప్ప నన్నర్థం చేసుకోరు. నేను వేశ్య కూతురినైనా నా మనస్సు, శరీరం చాలా పవిత్రమైనది. నా తల్లి నన్ను సంసారిని చెయ్యాలని కలలు కంది. ఆ కోరిక నీవల్ల తీరబోతోందని తెలిసి ఆనందించింది. ఇంతలో ఈ ఘోరం జరిగింది. నీ దగ్గర ఏ విషయం దాచడం నాకు యిష్టముండదు. నాలో రగిలిన ఈ మంటని నీకు చెప్పుకుని చల్లార్చుకోవాలని వచ్చాను" అంటూ మోకాళ్ళ మధ్య తల ఆన్చి ఏడవసాగింది దీప.

విషయం విన్న భరణి మనస్సు మొద్దుబారిపోయింది. అచేతనుడై కూర్చుండి పోయాడు. ఎక్కెక్కి ఏడుస్తున్న దీపని ఓదార్చాలని కూడా అనిపించలేదు. నెమ్మదిగా లేచి యింటి ముఖం పట్టాడు.

తోవంతా దీప గురించే ఆలోచనలు. భోగందాని కూతుర్ని పెళ్ళాడటానికి మనస్పంగీకరించింది. కానీ శీలాన్ని పోగొట్టుకున్న దీపని భార్యగా స్వీకరించడానికి మాత్రం అతని మనస్పంగీకరించటం లేదు. దీప నిర్దోషని తెలుస్తోంది. అయినా మనస్సుకి సమాధానం చెప్పుకోలేక పోతున్నాడు.

రోజాతో ఈ విషయాలన్నీ చెప్పి మనస్సు తేలిక పర్చుకోవాలనుకున్నాడు. కానీ అమ్మమ్మకి సీరియస్‌గా వుందని వైరు రావడంతో అనుకోకుండా నాలుగు రోజుల క్రితం అమ్మా, రోజా వూరి కెళ్ళారు.

దీప మళ్ళీ తన్ని కలవలేదు.

రోజా ఊరినుంచి వచ్చిన మర్నాడు "అన్నయ్యా! దీప ఈ వూరినుంచి చదువు మానేసి వెళ్ళిపోయిందట ఎందుకో నీకుతెల్సా?! వెళ్ళేముందు నిన్ను కలవలేదా?" అని అడిగిన దానికి "ఏమో! నాకు తెలీదే! నాకసలు నువ్వెళ్ళిన ఈ పదిరోజుల్లోనూ కనపడలేదే!" అన్నాడు అక్కడినుంచి తప్పించుకు వెళ్ళిపోతూ.

ఇన్నాళ్ళకి మళ్ళీ దీప ఈ వూళ్ళో కనపడటంతో మనసు కళ్ళెంలేని గుర్రంలా పరుగులు తీస్తోంది, ఆమె గురించి



## ఆఫీసు

మధ్యాహ్నం మూడింటికి ఓ గవర్నమెంటాఫీసుకి పని మీద వచ్చాడు ముకుందం. ఎవరూ కనిపించకపోవడంతో—

"అదేమిటయ్యా— మధ్యాహ్నం పూట ఆఫీసులో ఎవరూ పని చేయరా?" అడిగాడు అక్కడే వున్న ప్యూన్‌ని.

"పనిచెయ్యకపోవడం అనేది పొద్దున్నే అయిపోయిందండి" చెప్పాడు ప్యూను.

"ఓహో... అయితే ఇప్పుడు పని చేస్తారన్నమాట".

"అబ్బే... కాదండి... మధ్యాహ్నం పూట అసలాఫీసుకెవ్వడూ రారండి" తాపీగా చెప్పాడు ప్యూన్.

—కె.వెంకటరామ అక్కయ్య
(కంకిపాడు)

తెలుసుకోవాలన్న ఆతృత క్షణక్షణానికి అధికమవసాగింది. కానీ యింతటి మహాపట్టణంలో ఆమె వునికినెలా తెలుసుకోడం?

"తనకీ ఉద్యోగం వచ్చి ఏడాది అవుతోంది. దీప బ్రతుకే అలా నాశనం కాకుండా వుండివుంటే తనకి భార్య అయి వుండేది. ఇప్పుడామె జీవితం ఎలాంటి మలుపు తిరిగిందో! దీప కూడా తల్లిలా... యింక ఆలోచించలేక పోయాడు. ఒకవేళ అదే జరిగి వుంటే — చెయ్యని నేరానికి ఆమెని శిక్షించి, ఆ బురదలోకి తోసిన పాపం తనకే అంటుతుందేమో!" అని బాధపడసాగాడు.

దీప జీవితం గురించి తెలుసుకోవాలన్న ఆతృత, ఆలోచన భరణికి అర్థవంతంగానే వుండిపోయింది.

ఇంటికొచ్చిన మర్నాటి నుంచీ యధాప్రకారంగా తల్లీ, తండ్రీ భరణికి వచ్చిన సంబంధాల లిస్టుని ఏకరువు పెట్టి పెళ్ళి చూపులకి రమ్మని పోరసాగారు. 'ఉద్యోగం రానీ' అని కొన్నాళ్ళు, 'పెర్మనెంట్ కానీ' మని కొన్నాళ్ళూ దాటేస్తున్న భరణికి, యిప్పుడే వంకా కనిపించక, "నాకు కొంచెం టైమివ్వండి" అంటూ అక్కడినుంచి వెళ్ళి తన గదిలో పడుకొన్నాడు.

పక్క గదిలో తల్లీ, తండ్రీ అడుకునే మాటలు వద్దన్నా భరణి చెవిలో బాణాల్లా గుచ్చుకోసాగాయి.

"ఇంకా వాడి మనసులో ఆ భోగం ముండేవుందో ఏమిటో! అసలి రోజాకి బుద్ధిలేదు. అయినా దానికా భోగందానితో స్నేహమేమిటి?" అంటూ అశ్లీల పదాలతో మాట్లాడుతున్న తల్లితో తండ్రి "ఇంక ఆ ముండెక్కడుంది! ఈ ఊరినుంచి పోయిందిగా? ఈ పాటికి అదీ ఎక్కడో గుడిసేసుకునే వుంటుందిలే?" అనడం విన్న భరణి యింక ఆ మాటల్ని వినలేక చెవులు రెండూ మూసుకుని పక్కకి తిరిగాడు.

నిద్రపోదామన్నా పట్టడంలేదు. పట్టినా పీడకలలు మనసంతా దీప ఆలోచనలే! నిజంగా నాన్నగారన్నట్లు దీప ఆ వృత్తే చేపడితే దానికి కారకులెవరు?' అన్న ఆలోచన రాగానే, 'అలా జరక్కూడదు భగవాన్! దీప చక్కగా ఏ యింట్లోనో, ఎవరి జీవితంలోనో దీపమై వెలగాలి" అంటూ చేతులెత్తి దేముడిని ప్రార్థించసాగాడు భరణి.

కాలం గడుస్తోంది. ఉద్యోగరీత్యా నెలకి మూడు వారాలు యితర ఊళ్ళు తిరగడం అలవాటయిన భరణిని మాత్రం, దీప కనిపించిన దగ్గరనుంచీ, ఆమె జ్ఞాపకాలు వెంటాడటం మానలేదు. ఆమె ఆలోచనల్తో నెమ్మ నెమ్మదిగా సిగరెట్లు ప్రారంభించాడు. కొన్నాళ్ళకి అవీ తనకి ఉపశమనం యివ్వక డ్రింకులు తీసుకోవడం ప్రారంభించాడు. అదీ చాలక తనలోని ఆవేదన చల్లార్చుకోడానికి యింకా ఏదో కావాలన్న కోరిక పుట్టసాగింది. తల్లి, తండ్రులెంత బతిమాలినా 'యిదిగో, అదిగో' అని తప్పించుకొస్తున్న భరణి బైటికి రాగానే స్త్రీ సంపర్కం మీదకి దృష్టి పోసాగింది.

వున్నది స్టార్ హోటల్లో! డబ్బుండి, తల్చుకుంటే దేనికీ కొదవ వుండదు. వెంటనే యజమానిని పిల్చి మాట్లాడేదు. మాట్లాడిన మరో గంట తిరక్కుండానే వచ్చిందో జవ్వని. సుమారు పాతికేళ్ళుంటాయి. వచ్చిన కొద్దిసేపటికి తన రేటు చెప్పింది. రాత్రంతా అతనితో గడిపి తెల్లవారుతుండగా తన మామూళ్ళతో సహా వసూలు చేసి మరీ వెళ్ళింది.

ఏమిటో కొత్త అనుభవం, కొత్త అనుభూతి, కొత్త ప్రపంచంలోకి అడుగెట్టినట్లనిపించింది. ఏదో తృప్తి ఆనందం— ఇంకా, ఇంకా ఆ ఆనందాన్నందుకోవాలని మనసు పరిగెడుతోంది. దాంతో మరి దేనిమీదకి దృష్టిని కేంద్రీకరించలేకపోతున్నాడు. లేచి తప్పనిసరిగా ఆఫీసుకెళ్ళి పన్లు కానిచ్చుకొచ్చాడు. రాత్రికి మళ్ళీ హోటల్ మేనేజర్‌కి కబురెళ్ళింది. మళ్ళీ మరో సుందరి వచ్చింది.

ఈ వ్యాపారంలో ఆరితేరిన హోటల్ యజమాని ధరణి బలహీనతని కనిపెట్టి మర్నాటినుంచి అతని దగ్గరనుంచి కబురు రానక్కరలేకుండానే ఎన్నాళ్ళుంటారని అడిగి రోజుకో అమ్మాయిని సప్లయి చెయ్యసాగాడు.

రాత్రి ఎనిమిది దాటింది. విస్కీ బాటిల్ మూత తీసి గ్లాసులోకి పోసుకున్నాడు. సిగరెట్ అంటించాడు. కుడిచేతిలో విస్కీగ్లాసు, ఎడం చేతి వేళ్ళ మధ్య సిగరెట్టు.

సిగరెట్ తరువాత సిగరెట్ కాలి బూడిదయిపోతోంది. గ్లాసు తరువాత గ్లాసు ఖాళీ చేస్తుంటే బాటిల్ ఖాళీ అయిపోతోంది. సిగరెట్ మసిలా తన జీవితం పతనమౌతోంది. ఖాళీ సీసాలా తన ఒళ్ళు గుల్లవుతోంది. అన్నీ తెలిసినా ఏం చెయ్యలేని నిస్సహాయత అతన్ని అగాధంలోకి తోస్తోంది. రోజురోజుకీ మరికొంచెం దగ్గిరిగా జరిగి వాటికి అతుక్కుపోతున్నాడే తప్ప దూరం కాలేక పోతున్నాడు. దానికి తోడు నాలుగు రోజులుగా మరోకొత్త అలవాటు. చీకటి పడుతుండగానే ఏదో తాపం, దేనికోసమో తహతహ! మనసు కళ్ళెంలేని గుర్రంలా పరుగులు తీస్తోంది.



## బీద కబుర్లు

మన దేశంలో 27 కోట్లకు పైగా ప్రజలు దారిద్ర్యపు రేఖకు దిగువన ఉన్నారట! పట్టణాలలో అయితే నెలకు 56 రూపాయలూ, పల్లెలలో అయితే నెలకు 49 రూపాయల సంపాదన ఉంటే... వారు పేదవారు కాదట! ఇంత కంటే తక్కువ ఆదాయం ఉన్న వారే 27 కోట్లకు పైగా ఉన్నారంటే... మన దేశ ప్రజల ఆర్థిక పరిస్థితి ఎంత దయనీయమైన స్థితిలో ఉందో ఆలోచించండి! రాష్ట్రాల పరంగా చూస్తే అత్యధిక బీద రాష్ట్రం బీహార్. ఆ తర్వాత స్థానాల్ని మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, ఒరిస్సా, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్‌లు ఆక్రమిస్తున్నాయి— పూర్ ఇండియా!!

—జూపిటర్

గడియారంకేసి చూసాడు. విస్కీ ఎక్కువగా తీసుకోవడం వల్ల అంకెలు సరిగ్గా కనపడలేదు. ఇంతలో డోర్ బెల్ మోగింది. మత్తుగా వుండి, లేవలేక పోయాడు. ''కమిన్'' అన్నాడు ముద్దముద్దగా. బోయ్ ఓ అమ్మాయిని గదిలోకి దింపి వెళ్ళిపోయాడు. తూలుతూనే భరణి వెళ్ళి ఆమె పక్కన కూర్చున్నాడు. డోసు బాగా ఎక్కువయి పోవడంతో సోఫామీదే వళ్ళు తెలియకుండా పడిపోయాడు.

అర్ధరాత్రి మత్తువొదిలి తెలివి వచ్చింది. లేచి కూర్చున్న భరణికి సోఫాలో నిద్రిస్తున్న సుందరి కనిపించింది. తెల్లచీర, జడనిండా మల్లెలు 'సగం రాత్రిని వృధా కానిచ్చానే' అన్న బాధతో లేచి ఆమె పక్కన కూర్చున్నాడు. ఆ జవ్వని ముఖాన్ని రెండు చేతులతో పొదివి పట్టి దగ్గరికి తీసుకోబోయినవాడల్లా, షాక్ తిన్నట్లు లేచి నిలబడ్డాడు. ''ఈ రాత్రి తనకి బలి కావ డానికి వచ్చింది దీప!! అయితే నాన్నగారన్నవి నిజమేనన్నమాట!!'' ''ఉష్'' అంటూ బాధగా మూలిగి, కుప్పలా కూలిబడిపోయాడు భరణి.

''ఈసారి దీపని వెళ్ళిపోనివ్వకూడదు. ఎందుకింతలా దిగజారిపోయిందో తెలుసుకోవాలి'' అనుకొని లేచి తలుపు గడియ పెట్టి వచ్చాడు.

''దీపా!'' అని పిల్చాడు. కళ్ళు తెరిచిన దీప ఉలిక్కిపడి లేచి కూర్చుంది. సోఫాలో ఆమె పక్కగా కూర్చుంటూ 'దీపా! నువ్వీస్థితికి ఎందుకు దిగజారేవు?'' అన్న ప్రశ్నకి సూటిగా అతని వైపుకి చూసి నిర్లిప్తంగా ఓనవ్వు నవ్వి తల దించుకుంది. ఆ చూపులు సూలాల్లా వెళ్ళి అతని హృదయానికే గుచ్చుకున్నాయి. ఆ నవ్వులో 'నీవల్ల కాదా?' అన్న అర్ధం స్ఫురించకపోలేదు.

''దీపా! డిగ్రీ పూర్తి చేసావా?'' అన్నాడు మళ్ళీ తనే.


సమాధానంగా ''మీలాంటి మగవాళ్ళు గౌరవంగా బ్రతకాలనుకున్న నాలాంటి ఆడదాన్ని బ్రతకనివ్వరు. చదువుకోనివ్వరు. నా తల్లి చేసిన తప్పుకి నన్ను శిక్షించాలని చూస్తారు. ఉంపుడుగత్తె కూతుర్నని హేళన చేసే పెద్దమనుష్యులే, చాటుగా నన్ను వాడుకోవాలని చూస్తారు. ఈ సమాజం ఉంపుడుగత్తె కూతురు ఉంపు దుగత్తె అవ్వాలని కోరుకున్నప్పుడు నేనెలా డిగ్రీ పూర్తిచెయ్యగలుగుతాను భరణీ!'' అంది ఎదురు ప్రశ్నవేస్తూ.

సిగ్గుతో తల దించుకు కూర్చున్న భరణిని చూస్తూ ''భరణీ! ఒక్క విషయం అడగనా?'' అంది ఏమిటన్నట్లు తలెత్తి చూసాడు భరణి.

''మీలాంటి మగవాళ్ళకి భార్య అన్న వ్యక్తే శీలవతి అయివుండాలి కదూ? పతివ్రతని కట్టుకుని, చా టుమాటుగా మీ కోరికలు తీర్చుకోడానికి మాత్రం పతితలయినా పరవాలేదా??'' అన్న ప్రశ్నకి వెర్రివాడిలా దీపవైపు చూసి తలదించుకున్నాడు. ''చూడు భరణీ! నాలుగు రోజులుగా నీవద్దకి వస్తున్న ఏ ఆడదీ నువ్వు కోరుకున్న పతివ్రత, మహా ఇల్లాలు కాదు. ఎందుకిలా దిగజారావన్న దానికి జవాబు — ఒక్కసారి

ఆలోచించు ఆ రోజు పార్కులో నాకు జరిగిన అన్యాయాన్ని నీతో చెప్పుకున్నాను. నన్నర్థం చేసుకుని నీ అక్కున చేర్చుకుంటావని, నన్నాదరించి, నీ చేయూతనిస్తావని కోటి ఆశలతో నీదగ్గర కొచ్చాను. ఆ క్షణం నీ నిర్ణయం మరోలా వుండివుంటే నా జీవితం పూలబాటయ్యేది. అందరి పతివ్రతల్లాగే నీచేత పుస్తె అనే లైసెన్సు బిళ్ళ కట్టించుకుని దర్జాగా నీ పక్కన తిరిగేదాన్ని. కానీ నువ్వూ అందరిలాంటి మగాడివే! అతీతుడివి కావని రుజువు పర్చుకుని నేను చెయ్యని తప్పుకు నాకు శిక్ష విధించావు. నీకు భార్యనయి నాకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుకోగలననుకున్న నా ఆశ నిరాశే అయింది. ఫలితంగా నా బ్రతుకిలా బండబారిపోయింది. మంచి తోవని నడవాలనుకున్న నాలాంటి అభాగినుల జీవితాలతో ఆటలాడి మమ్మల్ని మరికొంచెం ఊబిలోకి తోస్తున్నది మీవంటి వాళ్ళు కదా?'' అంటూ ఆవేశంతో మాట్లాడుతున్న దీపని మధ్యలోనే ఆపి "దీపా! నావల్ల చాలా పొరపాటే జరిగిపోయింది. నీ జీవితమిలా మారిపోవడానికి నేనే కారకుణ్ణి. క్షమించు దీపా! నీవు క్రితంసారి కనిపించినప్పటినుంచీ నా మనసంతా నీ చుట్టూనే తిరుగుతోంది, నీ కోసమే గాలిస్తోంది. నా భార్యవి కాకపోయినా నీ జీవితం మూడు పువ్వులు ఆరు కాయలు కావాలని కోరుకున్నాను. నిన్ను పొందలేకపోయానన్న ఆవేదనే నన్నీ దుర్వ్యసనాలకి దారి తీయించింది. ఇప్పుడు నిన్నిలా చూసినదగ్గరనుంచీ నా మనస్సు మరీ దహించి వేస్తోంది. నీ జీవితమెలా చక్కదిద్దగలనో చెప్పు! నన్నింక మాటలతో హింసించకు. నావెంట తీసుకెళ్తాను, నా భార్యగా స్వీకరిస్తాను'' అంటూ దీనంగా దీప చేతులు పట్టుకు బ్రతిమాలుతున్న భరణి మాటలకి పేలవంగా నవ్వుతూ "అన్నట్టు భరణీ! అసలు నా జీవితాన్ని ఆరోజు నాశనం చేసిందెవరో అడగలేదేం?'' అంది.

''అవును నిజమే! అసలు నీ బ్రతుకుని



బజారుపాలు చేసిందెవరు?"

"ఎప్పటిలాగే మీ చెల్లెలికోసం మీ యింటికి వచ్చాను. రోజా, మీ అమ్మగారు వూరెళ్ళారని పదిరోజుల దాకా రారని, నువ్వింట్లో లేవని తలుపు తీసిన మీ నాన్నగారు చెప్పారు. వెళ్ళిపోబోతున్న నన్ను పిల్చి – నీతో మాట్లడాలి పది నిమిషాలు కూర్చుంటావా? – అని అడిగిన దానికి లోపలికెళ్ళాను. ఎదురుగా కూర్చున్న నాన్నగారు నావైపు సూటిగా చూసి 'ఏమిటి నువ్వు మా భరణిని పెళ్ళాడాలనుకుంటు న్నావుట కదా!' అని అడిగిన దానికి ఏం సమాధానమివ్వాలో తెలీక తలదించుకున్నాను. పెద్దవారు, అందునా యిలాంటి ప్రశ్నకెలా జవాబివ్వాలో తెలీలేదు. వెంటనే మళ్ళీ తనే 'నీ భోగం బుద్ధి పోనిచ్చుకోలేదా? నీకు కావాలంటే రోడ్డున పోయేవాళ్ళు చాలా మంది దొరుకుతారు. మాకొక్కడే కొడుకు వాడిమీదెన్నో ఆశలు పెంచుకున్నాము. పైగా తరవాత ఆడపిల్ల పెళ్ళవ్వాలి. వాళ్ళ జీవితాల్ని నాశనం చెయ్యకు ' అని అనగానే నేను ఆయన్ని సూటిగా చూసి, 'యిది నా ఒకర్తి నిర్ణయమే కాదు. మీ భరణిది కూడా' అన్న దానికి ఛరుగ్గున లేచివచ్చి నా జబ్బపట్టు కుని గదిలోకి లాక్కెళ్ళారు. నేను పెట్టిన కేకలు, అరుపులు గట్టిగా పెట్టిన టి.వివల్ల ఎవ్వరికీ వినపడివుండవు. నన్ను అలా నాశనం చేసిన నీ తండ్రి, "సిగ్గున్న దానివైతే మళ్ళీ నా కొడుకు జోలికే కాదు, ఈ గుమ్మంలోకే రాకు, పో – బైటికి" అంటూ వీధిలోకి నెట్టేశారు. నాకు నీ దగ్గర ఏదీ దాచడం యిష్టంలేక, నిన్ను పార్కుకి తీసుకెళ్ళి చెప్పాను. నువ్వేగానీ నా జీవితాన్ని ఆరోజు మరో మార్గానికి మళ్ళించి వుంటే, నీ తండ్రికి బుద్ధిచెప్పి, నా మచ్చని మాపుకుందామనుకున్నాను. కాని విధి వక్రించింది.

ఇంటికొచ్చి నా తల్లితో జరిగిదంతా చెప్పగానే బెంగతో గుండె ఆగి మరణించింది. 'నా గతి ఏమిటి?

దిక్కుతోచని నాకు మా అమ్మని పోషించిన జమిందారే గతయ్యాడు. కొన్నాళ్ళకి అతనూ గతించాడు. దాంతో నా బ్రతుకిలా బజారుపాలయింది. ఇదీ నా వేశ్యా వృత్తికి నాంది. సరే– అయిపోయిందేదో అయిపోయిందిగానీ – నీతో ఒక్క మాట చెప్పాలనే అసలు ఆగింది! నీ మంచిని కోరే ఒక వ్యక్తిగా నీకోసలహా నిస్తాను. ఇక ముందయినా చెడువ్యసనాలకి బానిసై నీ భవిష్యత్‌ని నాశనం చేసుకోకు. నాలాంటి పతితలతో తిరిగి అపవిత్రం కాకు. నువ్వు నీ భార్య పతివ్రత కావాలనుకున్నట్లే, నీ భార్య కూడా తన భర్త శ్రీరామచంద్రుడి వంటి వాడు రావాలని కోరుకుంటుంది. బుద్ధిగా మసులుకుని, నీ తండ్రి కోరికని కూడా తీర్చడానికి ప్రయత్నించు వస్తా!" అంటూ లేచి చక చకా తలుపు తీసుకుని బైటికెళ్ళిపోతున్న దీపకి అడ్డుగా నిల్చుని "దీపా! ఒకే బురదలో యిరుక్కున్న మనం, ఒకే పడవలో ఎక్కి ఒడ్డుకి చేరుకోడానికి ప్రయత్నిద్దాం – రా!" అంటూ ఆమెని గుండెలకి హత్తుకున్నాడు భరణి. ✱